ఆదివారం

ప్రజాశక్తి

సెప్టెంబర్ 8, 2002

సంపూర్ణ అక్షరాస్యత సాధించేదెన్నడు?

హ్యాపీబర్త్‌డే

(8-9-2002 నుండి 14-9-2002 వరకు)

బి. లోకేష్
1సం॥, 8.9.2001
వాణి-బి.వి. రమణ
తిరుపతి, చిత్తూరు జిల్లా

దేవరపల్లి సింధి
సెప్టెంబర్ 8
ప్రభ-బాబూరావు
జిన్నారం, మెదక్ జిల్లా

గేరా లత
1సం॥, 8.9.2001
సువర్ణ-రాజశేఖర్
కృష్ణలంక, విజయవాడ

బి. విధాత
2సం॥, 9.9.2000
బసమ్మ-బసవరాజు
కౌతాళం-కర్నూలు జిల్లా



జోగేశ్వర్ మణికంఠ దొర
2సం॥, 9.9.2000
సుజాత-వీరేంద్రబాబు
రాయభూపాలపట్నం, తూ.గో. జిల్లా

ఎం. రాజిత
సెప్టెంబర్ 10
సువర్ణ-రాజారాం
పుల్కల్, మెదక్ జిల్లా

రవితేజ
8సం॥, 11.9.1994
పద్మావతి-వి.ఎస్. రాజు
విజయవాడ



కె.రాకేష్
10సం॥, 11.9.1992
శైలజ-సుబ్బారావు
హైదరాబాద్

పెసల దీపక్
1సం॥, 14.9.2001
రోజాకుమారి-దుర్గారావు
శ్రీకాకుళం

పల్లవి
4సం॥, 14.9.1998
జయశ్రీ-సంజయ్
కెరమెరి-అదిలాబాద్ జిల్లా

4సం॥, 14.9.1998
మాధవి-రమేష్
జగిత్యాల

నిఖిల
1సం॥, 14.9.2001
సుధారాణి-నాగేశ్వరరెడ్డి
తురగావారిపాలెం-గుంటూరు జిల్లా

చుక్కలు కలపండి

క్విజ్-21

1. 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న ప్రముఖ కవి ఎవరు ?
ఎ. శ్రీశ్రీ. బి. గురజాడ
2. 'గీతా గోవిందం' రచయిత ఎవరు?
ఎ. జయదేవుడు బి. శ్రీకృష్ణుడు
3. భూమికి ఉపగ్రహం ఏది?
ఎ. సూర్యుడు బి. చంద్రుడు
4. 'పింక్ సిటీ' అని ఏ నగరానికి పేరు?
ఎ. బెంగుళూర్ బి. జైపూర్
5. 'సుగర్ ఆపిల్' అని దేనికి పేరు?
ఎ. సీతాఫలం బి. మామిడిఫలం
6. రాళ్ళు తినే పక్షి ఏది?
ఎ. డేగ బి. ఉష్ట్రపక్షి
7. పొడవైన జంతువు ఏది?
ఎ. జిరాఫీ బి. ఒంటె
8. అహ్మదాబాద్ సమీపంలోని గాంధీ ఆశ్రమం పేరేమిటి?
ఎ. నిర్మల్ హృదయ్ బి. సబర్మతి
9. దండి ఉప్పు సత్యాగ్రహం ఏ సంవత్సరంలో జరిగింది?
ఎ. 1930 బి. 1940

10. పక్క ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ. బాబా ఆమ్టే బి. జిడ్డు కృష్ణమూర్తి

డాట్‌కామ్.

ఇంటర్నెట్‌లో మనకు కావాల్సిన సమాచారాన్ని అందించేందుకు పలు సెర్చ్ ఇంజన్లు ఉంటాయి. ఈ కింది సెర్చ్ ఇంజన్ చాలా త్వరగా మనకు కావాల్సిన సమాచారం అందిస్తుంది.
www.google.com

ఏ రంగు?

రాజు, దీప ఆడుకుంటున్నారు. కొద్దిసేపటికి వాళ్ళ మధ్య పోట్లాట కూడా ప్రారంభమయ్యింది. ఒక్కసారిగా పోట్లాడుతున్న వారిని వాళ్ల మావయ్య విడదీశాడు. 'మీరు కొద్దిసేపు ప్రశాంతంగా ఉండేందుకు ఒక పజిల్ చెప్పనా?' అన్నాడు. సరే అన్నారు ఇద్దరూ.

'ఆకుపచ్చ రంగు వెలుతురులో ఎర్రని చీర ఉంచితే ఆ చీర ఏ రంగులో కనిపిస్తుంది?' ఇదీ వాళ్ళ మావయ్య చెప్పిన పజిల్. రాజు గులాబీ రంగులో అంటే దీప నలుపు రంగులో అని చెప్పింది. ఇంతకీ ఇద్దరిలో ఎవరు కరెక్టో మీరు రాసి పంపాలి. కమాన్ క్విక్...

బాలకవులు

ఆశయం

ఇదే ఆశయం కోసం
ఎదురుచూసితినమ్మా ఇన్నాళ్ళుగాను
చేతివేళ్లనే పిడికిలిగా మార్చి
ముందుకే సాగితినమ్మా
నా ఆశయాన్ని
ధ్యేయంగా మలచుకొన్నాను
నా ధ్యేయాన్ని ధైర్యంగా మార్చుకొన్నాను
నా ఆశయం కోసం పోరాడుతాను
నా ఆశయం తీరడమే నా కర్తవ్యం.!

-జి. శిరీష, 8వ తరగతి,
రాహుల్‌స్కూల్, చీరాల.

ఆశయం-జీవితం

అది మన లక్ష్యం
అదే మన ఆదర్శం
ఆశయసాధనకు కృషి చేయాలి
బతుకు బాటలను మలచుకోవాలి
ఆశయం కోసం పోరాడాలి
ఆశయం లేని జీవితం ఎందుకు
ఆశయం జీవితం
ఆశయం శాశ్వతం
ఆశయమే ధ్యేయం
అదిలేని జీవితం శూన్యం!

-ఆర్. నాగవేణి, 8వ తరగతి,
రాహుల్ స్కూల్, చీరాల.

వాపస్ వాయినాలు

రుక్మిణి

బతకమ్మ పండగ ఎట్లాగూ దగ్గరకొస్తుంది గదా... ఆడంగులందరూ పాటలు మధురంగా పాడుకుంటున్నారు – దరువుగా చప్పట్లు... లయబద్ధంగా కదులుతూ పాడుకుంటున్నారు. ఆ సందట్లో నుండి బయటపడి చిరుచీకట్లో యాద్గిరి రావిచెట్టు కింద కూలబడి బీడీ వెలిగించాడు. మరికొన్ని రోజులు పోతే ఇంగ ఈ ఆటలూ... పాటలూ సంబరాలుండవు కాబోలు...

అంతలో సందెచీకట్లో నుండి మల్లేషు ఆదరాబాదరాగా వచ్చి, చప్టా మీద కూలబడడంతోనే యాద్గిరి చెవికొరికినంత పని చేశాడు.

"అన్నా.. ఆ వెంకులుగాడే... వాడే ఈ పన్జేసింది. అయిపోయిందా... దొరికిపోయిండు గద... వారం రోజుల్నుండి సతాయించి... సతాయించి...

యాద్గిరి చెవి వదిలించుకున్నాడు... ఎట్లా మంత్రం బియ్యం వాడినవా?" "ఛూ... వాడే గుడుంబా గురివిగాడి దగ్గర గొంతువరకు బాగ తాగి జోబిలో నుండి తీసి చూపిచ్చిండు – వాడు నాకు చెప్పిండు – ఇపుడు అర్జంటుగా పోయి వాడి నడ్డి ఇరగదన్ననా...!" మల్లేషు మహాజోరుగా ఆవేశపడిపోతున్నాడు.

"బతకమ్మ... బతకమ్మ వుయ్యాలో...!" పాట సందడిగా వినిపిస్తుంది. యాద్గిరి టక్కున బీడీ విసిరేశాడు. "అట్లాకాదు – దాన్ని పోలీసులకి రిపోర్టు చెయ్యాలె... మొన్నటికి మొన్న వెంకులుగాడు అందరి ముందు జబ్బలు చరిచి... నీతి నిజాయితి దంచి పెడబొబ్బలు పెట్టిండు గద... పదర పోలీస్ స్టేషన్‌కి"

యాద్గిరి వెంట మల్లేషు గబగబ చప్టా దిగి వెంటపడ్డాడు.

☆ ☆ ☆

మర్నాడు పొద్దున్నే కానిస్టేబులు కనకయ్య లాఠీ జమాయించుకుంటూ చప్టా మీద కూలబడ్డాడు. ఊరిజనం చాలా మంది అప్పటికే పోగయ్యారు. గుడుంబా గురవయ్యను మల్లేషు కట్టుబట్టల్తోటి అక్కడ హాజరు పరిచారు.

విచారణ మొదలయ్యింది–

"గురవయ్యా... అరె.. నువ్ గుడుంబా అమ్ముతవ్ గద... కదా!" కనకయ్య లాఠీ ఝుళిపించాడు.

"సార్.. అమ్ముతానూ.. అంటే... అదే... ఏదో నా కాళ్ళ మీద నేను నిలబట్టానికి నాకు చాతనైన పని నేను చేసుకుంటుపోతున్నా... ఏం చేస్తాం – మన చెంద్రబాబుగారు దరమరాజు... ఎన్నో రకాల పథకాలు పెట్టి గీ దరిద్రాన్ని వదలగొడదామంటే వీలుకాటం లేదాయె! పెద్ద ప్యాక్టరీ పెడదామంటే గీ బ్యాంకోల్లను అప్పడిగితే వాండ్లు గ్యారంటీ అదుగుతారాయె! తవరు గానీ దయ జూపి ఓ ట్రాక్టరు లోదు బెల్లం అప్పుగా ఇప్పిస్తిరా... ఏదో నా యాపారం నేన్జేసుకుని సల్లంగుంట...

గుంపులో కిసకిసలు చెలరేగడంతో కనకయ్య పెట్రేగిపోయాడు. "అరె... నీ కాళ్ళూ... యాపారం నాకెందుకుబే... ఆ మల్లేషుగాడి గొలుసు... బంగారం.. ఆ వెంకులుగాడు... వాడూ.. ఆ గొలుసు సంగతి చెప్పు"! అని గదిరించాడు. గురివిగాడు కాసేపు తన గుడుంబా యాపారం సంగతి పక్కన

పడేసరికి కుమిలిపోయాడు–

"సర్సరె... సారూ... ఆ గొలుసు నికరంగా వెంకులుగాడి దగ్గరుందని ఆడే నాకు చెప్పిండో... నేనే చూసినానోగానీ గొలుసుందయ్య."

ఒక మాంచి ఎత్తయిన బండరాయి మీద దవడ గీక్కుంటూ గుర్రుగా ఇదంతా చూస్తున్న వెంకులు తమాయించుకున్నాడు.

"ఏరా వెంకులూ... ఆ గొలుసు నువ్వే తీసినావా... కేసైపోద్ది... జైలు.. కోర్టు.. గొలుసంటే మాటలు కాదు...

మల్లేషు మటమటలాడుతూ వెంకులు వంకే మంటగా చూస్తున్నాడు. వాడేమో అధాటున జోబీలో నుండి ధగధగా మెరిసే బంగారం గొలుసు పీకి మల్లేషు ముందు కనకయ్యసాక్షిగా పెట్టేసినాడు. కనకయ్య తెల్లబోయి కండ్లు మిటకరించాడు.

"ఇంకేం... కండ్లు సల్లబడినై గద... బాగుందా... అందరూ దొంగలే – నేను కటిక దరిద్రం అనుభవించినా నీతి తప్పేటోడ్ని కాదు – ఓసారి కిలో బంగారం ఇస్తామన్నా 'కోన్‌కిస్కా నాకెందుకని' విసిరికొట్టినోడ్ని... ఏదో అవుసరం వుండీ కాదు.. అదట్లా ఎవరో కావాల్నని నా మీదేస్తే నేను పెట్టెలో వేసుకున్నా... అంతే!"

ఈ మాటలు అనేసి వెంకులు విసవిసా గుంపులో జొరబడి జబ్బలు చరుచుకుంటూ వెళ్ళిపోవడంతో జనమంతా తెల్లబోయి నోర్లు వెళ్ళబెట్టారు –

"ఇంకేం.. తేలిందిగా.. దొంగతనం కేసు తగిలిచ్చండ్రి...!" మల్లేశు అరిచాడు..

"ఎట్లా? దొంగను కానూ... నీ వస్తువు నీకు అప్పజెప్పేనంటున్నాడు గదరా! మల్లా అట్లాంటి పెద్దమనిషి మీద కేసంటావేంటి?" కనకయ్య ఆర్గ్యుమెంటుతో మల్లేషు తెల్లబోవడంతో మరో పెద్ద కలకలం మొదలయింది. జక్కులోడు, వాడి భార్యా రావులు గాడ్ని రెక్కలు విరిచి పట్టుకుని బరబరా లాక్కొచ్చారు. వాడు ఆశ్చర్యంగా అప్పటిదాకా వెంకులుగాడు కూర్చున్న పెద్ద బండరాయి మీదనే బొర్ర నిమురుకుంటూ కూలబడి చుట్ట వెలిగించాడు.

"అయ్యా పోలీసు గారూ... గీ రావులుగాడు రాత్రికి రాత్రి నా మూడు కిలోల పుంజును సఫా జేసి పారేసిండు – దాని ఈకలన్నీ పీకి మా గుడిసె వెనక గుమ్మరించాడు. సచ్చినోడ... నీ కడుపు పగిలిపోను.. పందెం పుంజని సాదుకుంటిని...!" జక్కులోడి భార్య రాగాలు పెడుతున్నా రావులు బొళబొళ నవ్వడం తప్ప ఒక్క మాటైనా మాట్లాడకపాయె!

"ఏరా రావులు... ఆ కంప్లెంటేంటి? బద్మాష్!" కనకయ్య లాఠీ తిప్పాడు.

"కంప్లెంటు కరక్టే సారూ...!" రావులు జవాబుతో అక్కడి జనాలు బేజారెత్తి నోరెళ్ళబెడితే జక్కులోడు కోపంతో చిందులకూ... వాడి పెండ్లాం శాపనార్థాలకూ తగులుకుంది.

"నా మూడు కిలోల పందెం పుంజు... నీకడుపారిపోను...!" కనకయ్య గుడ్లురిమాడు.. 'అది కాదురా... వాడి పుంజును నువ్వెందుకు కోసక తిన్నావ్‌రా గాడిదా!"

"అరె... పెద్ద పండగాయె... తినబుద్ధయ్యింది... చీకట్లో దొరికింది – కొక్కిన కోసి – కాపి – పూరా తినిపారేసిన!" వాడు లొట్టలేస్తూ చెప్పడంతో జనం హాహాకారాలు మరోసారి చేశారు.

"నా మూడు కిలోలు... పందెం పుంజు..

"ఊర్కొన్సె... నేను తప్పే చేసిన – గా చీకట్లో గది గుడ్ల పెట్టనుకున్న గద...తీరా కోసినంక తెలిసింది గది పందెం పుంజని! ఏం చేయను.. కోసి–కాపి... పూరా...

ఈసారి జనం హాహాకారాలు చేసే ఓపిక లేక మిడిగుడ్లేసినారు. "అరె.. అది ఆటపుంజు గద... నువ్వెట్ల తింటవ్...!" కనకయ్య నోరు బార్లా తెరిచాడు.

"తప్పయిందన్నగద... దాన్ని చీకట్లె గుడ్ల పెట్టనుకొని తడాల్న కోసి–కాపి" కనకయ్య తలపట్టుకున్నాడు. ఆనక తేరుకుని రాగాలు తీస్తున్న జక్కులోడి పెండ్లాన్ని గదమాయించి – కేసూ... మరి దానిలోని లౌక్యం... తన అంతిమ తీర్పు కూడా లటలట వినిపించి పారేశాడు.

"జక్కులోడా... దొంగతనం చేయటం తప్పే... మరి చేసినోడు చాలా గొప్పోడు కాబట్టి నగా నట్రా వాపస్ చేసిండు. కేసు మాఫ్! మరి వీడు పెట్టనుకుని పుంజును తెంపి తినేసిండు – పెద్ద పండగాయె! తిన్న దాన్ని తిరిగి కక్కమంటే నీ పుంజునెట్ల కక్కుతడు – ఈకలు పీకి జల్లిండాయె! పెద్ద పెద్ద పండగలు చేసుకునేటపుడు గిట్లా పెట్టా... పుంజూ.... తోలూ... ఈకలూ లెక్కలు గట్టి డొక్కలు చించుకోడం నాన్సెన్స్... కేసు మాఫ్!"

కనకయ్య చేతులు దులుపుకున్నాడు! ✤

భారత క్రికెట్‌లో మరో సంచలన తార ఉద్భవించాడు. 16 ఏళ్ల ప్రాయంలోనే ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన రాష్ట్ర యువరత్నం భారత సీనియర్ జట్టులో స్థానం సంపాదిస్తానని ఘంటాపథంగా ప్రకటిస్తున్నాడు. క్రికెట్ మక్కాగా పేరుగాంచిన లార్డ్స్‌లో పిన్న వయస్సులోనే అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్, మహ్మద్ అజరుద్దీన్, వి.వి.ఎస్.లక్ష్మణ్ వంటి మేటి క్రికెటర్లను వెలికితీసిన తెలుగు గడ్డ మరో యువ సంచలన తారను సానపెట్టే పనిలో నిమగ్నమై ఉంది. అతనే అంబటి తిరుపతి రాయుడు

రాంప్రసాద్

పుల్లెల గోపీ చంద్, కోనేరు హంపి, పూజారి శైలజ, మిథాలీ రాజ్ భారత్, ప్రత్యేకించి మన రాష్ట్ర పేరు ప్రతిష్టలను ఇనుమడింప చేయగా నేడు ఆ బాధ్యతను అంబటి రాయుడు తీసుకున్నాడు. ఇంగ్లండ్‌లో పర్యటించిన భారత్ అండర్ 19 జట్టు టెస్టుల్లో పెద్దగా ప్రతిభ చూపకపోయినప్పటికీ వన్డేల్లో బాగా రాణించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తేడాతో క్లీన్‌స్వీప్ చేసి ఇంగ్లండ్ జట్టును కంగు తినిపించింది. భారత జట్టు కోచ్ రాబిన్ సింగ్ పేర్కొన్నట్లుగా ఇది సమిష్టి విజయమే అయినప్పటికీ ఒక క్రికెటర్ పేరు నలుదిశలా వ్యాపించింది. రెండో మ్యాచ్‌లో 82 పరుగులు చేయడం, చివరి మ్యాచ్‌లో ఏకంగా 177 పరుగులు చేసి నాటౌట్‌గా మిగలడంతో ఒక్కసారిగా అంబటి రాయుడి పేరు మార్మోగిపోయింది. అతడు కేవలం 137 బంతుల్లో ఈ పరుగులు చేయడం గమనార్హం. భారత్ భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ వరుసగా వికెట్లు కోల్పోతున్న తరుణంలో ఈ క్రికెటర్ నింపాదిగా ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు. ఇంకా 25 పరుగులు కావాల్సి ఒక వికెట్ మాత్రమే మిగిలి వున్న తరుణంలో అతడు నిబ్బరంగా ఆడి ఇంకా పదకొండు బంతులు మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో ఒక్కసారిగా అంబటి తిరుపతి రాయుడు వార్తల్లో ప్రముఖుడిగా మారాడు. అతడు ఈ సిరీస్ ఆద్యంతం మంచి ప్రావీణ్యం ప్రదర్శించాడు. రాయుడు 177 పరుగులు చేసింది క్రికెట్ మక్కాగా అభివర్ణింపబడే లార్డ్స్ మైదానంలో కావడం మరీ విశేషం. రాయుడు హైదరాబాద్‌కు చెందినవాడు కావడం మరో విశేషం. మిథాలీ రాజ్ కూడా ఇదే గ్రౌండ్‌పై ఇటీవల 214 పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. నాట్‌వెస్ట్ సిరీస్ ఫైనల్లో యువరాజ్ సింగ్, మహమ్మద్ కైఫ్ ఆడిన ఆటను తాను గమనించాననీ, దీనిని ప్రేరణగా తీసుకున్నాననీ అతడు పేర్కొన్నాడు. రెండో వన్డేలో 82 పరుగులు చేసి చెత్త షాట్‌కు అవుటయ్యాడు. ఇన్నింగ్స్ చివరి వరకూ క్రీజ్ వద్ద నిలిచి ఉండేందుకు ప్రయత్నించాలని రాడ్నీ మార్ష్ సలహా ఇచ్చాడు. దీనిని రాయుడు చివరి మ్యాచ్‌లో తూ.చ.తప్పకుండా అనుసరించాడు. ఇది సత్ఫలితం ఇచ్చింది. తన వైఫల్యం నుండి గుణపాఠం నేర్చుకోవాలని ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. సీనియర్ క్రికెటర్లలో సైతం లోపిస్తున్న అంకితభావాన్ని, నైపుణ్యాన్ని ప్రదర్శించి భవిష్యత్ తనదేనని నిరూపించుకున్నాడు. ఒక వైపు వికెట్లు పడిపోతుంటే కంగారు పడకుండా అతడు జట్టును విజయపథంలో నడిపిన తీరు అందరి ప్రశంసలు అందుకుంది. ఈ విజయం తనదొక్కడిదే కాదని, కులదీప్ రావత్ తనకు బాగా సహకరించాడని చెప్పిన తీరు అతనిలోని వినమ్రతను చాటిచెపుతుంది. ఇన్నింగ్స్ చివరిలో రిస్క్ తీసుకోవడం తనకు అనివార్యమైందని అన్నాడు. అవసరమైన తెగింపు ఉందని దీంతో వెల్లడవుతోంది. అయినా జట్టును ఒంటి చేత్తో గెలిపించానని తాను భావించడం లేదని, అయినా ఇది క్రికెట్‌లో కొత్త విషయం ఏమీ కాదనీ వినమ్రంగా పేర్కొన్నాడు. అతడు నగరంలోని రామకృష్ణ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. టెస్టుల్లో రాణించకపోవడంతో వన్డేల్లోనైనా సత్తా చూపాలని తనలో పట్టుదల పెరిగిందన్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఓపెనర్‌గా తాను బాగానే ఆడటంతో అలాగే కొనసాగానని పేర్కొన్నాడు. దేశవాళీ మ్యాచ్‌ల్లో అతడు వన్‌డౌన్ బ్యాట్స్‌మన్‌గా వచ్చేవాడు. ఇంగ్లండ్‌లో జరిగిన అండర్ 15 వరల్డ్‌కప్‌లో అతడు ఓపెనర్‌గానే ఆడాడు. విండీస్‌పై సెంచరీ కూడా చేశాడు. తాను వన్‌డౌన్ బ్యాటింగ్‌నే ఇష్టపడతానని, అవసరమైతే ఓపెనర్‌గా కూడా ఆడగలనని పేర్కొన్నాడు. అతనికి తల్లిదండ్రులు, ఒక సోదరి ఉన్నారు. మితంగా మాట్లాడే అతడు విమర్శకులకు తన బ్యాట్‌తోనే సమాధానం చెపుతాడు. అతడు చాలా పొదుపుగా మాట్లాడతాడని తండ్రి సాంబశివరావు పేర్కొన్నారు. తాను మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. అతన్ని స్పాన్సర్ చేసేందుకు ఏ కార్పొరేట్ సంస్థలూ ఇప్పటివరకూ ముందుకురాలేదు. ఇది కూడా అతనికి ఒకందుకు మంచిదేనని చెప్పాలి. అతనిపై ఒత్తిడి ఉండదు. సహజమైన ఆట ఆడేందుకు అవకాశం ఉంటుంది. అతడు త్వరలోనే భారత జట్టులోకి రాగలడని ఆశించవచ్చు. హైదరాబాద్‌కే చెందిన వి.వి.ఎస్. లక్ష్మణ్ ఫోన్ చేసి అభినందించడం మరచిపోలేని అనుభవమని పేర్కొన్నాడు. అతనిని అభినందించిన వారిలో భారత జట్టు మేనేజర్ రంగారెడ్డి కూడా ఉన్నారు. రాయుడు ఆటను తిలకించిన రాడ్నీ మార్ష్ ఇంగ్లండ్ జట్టు కోచ్ అభినందనలతో ముంచెత్తారు. టెస్టుల్లో మాత్రం అతడు రాణించలేకపోయాడు. మొదటి టెస్టులో 15,9, రెండో టెస్టులో 13 పరుగులు చేశాడు. మూడో టెస్టులో ఆడలేదు. భారత్ టెస్టు సిరీస్‌ను 0-1 తేడాతో కోల్పోయింది. అతడు హిమాచల్‌ప్రదేశ్‌పై ఆడిన రంజీ మ్యాచ్‌లో 33 పరుగులు చేసి ఎల్‌బిడబ్ల్యు అయ్యాడు. ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మరింత ఎక్కువగా ఆడాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు. విజయ్ పాల్, నాగేష్ హామండ్ అతనికి కోచ్‌లుగా ఉన్నారు. మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్ అతనికి ఇంటర్‌లో సబ్జెక్ట్‌లు. పరిస్థితులకు తగ్గట్లుగా ఆడటంలో రాయుడు నేర్పరితనాన్ని అలవాటు చేసుకోవాల్సి ఉందనీ, ఒక్కోసారి అనవసరంగా షాట్లకు పోతాడనీ, దీన్ని నియంత్రించుకోవాల్సి ఉందనీ కోచ్ పాల్ వ్యాఖ్యానించారు. భారత జట్టులో ప్రవేశించే సత్తా అతనికి ఉందని జాతీయ సెలెక్టర్ శివలాల్ యాదవ్ పేర్కొన్నారు. రంజీ ట్రోఫీలో పెద్ద స్కోరు చేయగలడని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఏమైనా రాజకీయాలు అవరోధంగా మారకపోతే భారత జట్టుకు మరో వేలిముత్యం లభించిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. ✤

అంబటి తిరుపతి రాయుడు
జన్మతేది : 23 సెప్టెంబర్ 1985
జన్మస్థలం : గుంటూరు
ప్రాతినిధ్యం : హైదరాబాద్ క్రికెట్ జట్టు
బ్యాటింగ్ స్టయిల్ : కుడిచేతి బ్యాటింగ్
బౌలింగ్ స్టయిల్ : రైట్ ఆర్మ్ ఆఫ్ బ్రేక్

అధికారి

వి.గోపి

"నాన్నగారూ సాయంత్రం మీరు త్వరగా రావాలి. మీరు వచ్చిన తరువాతే షాపింగ్‌కు వెళ్ళేది" అంటూ శర్మగారి చిన్న కూతురు అమల కారు వరకు ఉరికి వచ్చి అంది.

శర్మగారు "సరే అమ్మా అలాగే ఇవాళ త్వరగానే వస్తాను" అన్నాడు లాలనగా, డ్రైవర్ కారు స్టార్టు చేసిండు. ఒక్కసారి ఇంటికేసి చూసిండు శర్మ. ముందు దర్వాజ కాడ భార్య శకుంతల, పెద్ద కూతురు శైలజ నిలుచుని వీడ్కోలుగా చేతులు ఊపుతున్నారు. కారు మూల మలుపు తిరిగి మెయిన్ రోడ్డు ఎక్కింది. రాజధాని నగరపు రోడ్డు మీద ఉదయపు పూట ఉండే ఉరుకులు పరుగుల సంచారంలో కారు కలిసిపోయింది.

రెండు రోజులుగా శర్మగారి మనసేమీ బాగుండటం లేదు. అందుకు కారణం లేక పోలేదు. శర్మగారు సీనియర్ ఐఎఎస్ అధికారి. అసిస్టెంట్ సెక్రటరీ స్థాయిలో మినరల్ డెవలప్‌మెంట్ శాఖలో పని చేస్తున్నాడు. మాంగనీసు క్వారీ కాంట్రాక్టు విషయంలో దేశంలో పేరెన్నిక గన్న రెండు పెద్ద పారిశ్రామిక సంస్థలు పోటీ పడుతున్నాయి. దానికి సంబంధించిన ఫైలు ఇప్పుడు శర్మగారి టేబుల్ మీదికి వచ్చింది. ఆయనగారు దీన్ని 'ఓకే' అంటే కాంట్రాక్టు వారి చేతికి వస్తుంది. 99 సంవత్సరాల కాంట్రాక్టు. వేల కోట్లకు సంబంధించిన వ్యవహారం. కాంట్రాక్టు కోసం పోటీపడుతున్న రెండు ప్రయివేటు పారిశ్రామిక కుటుంబాలు లీజు వ్యవహారం తమకే దక్కాలని అన్ని రకాలుగా తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. రాజకీయ ఒత్తిడి, పైరవీలు, నయానో భయానో లొంగదీసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కాని శర్మగారు వారి ప్రయత్నాలు సాగనివ్వటం లేదు.

సరిగ్గా వారం రోజుల కింద లీజు కోసం ప్రయత్నిస్తున్న ఒక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మల్హోత్రా వచ్చి మాట్లాడి పోయిండు.

"చూడండి శర్మగారూ, ప్రభుత్వం లిబరలైజేషన్ విధానం అమలు జరుపుతూ ప్రైవేటు రంగంలో పరిశ్రమలు ప్రోత్సహించటానికి ముందుకు వచ్చింది. ఆ నేపథ్యంలోనే మా సంస్థ వెయ్యి కోట్లతోని ప్లాంటు నెలకొల్పడానికి సిద్ధమై అన్ని ఏర్పాట్లు చేసుకున్నది. మీ దగ్గరి క్వారీకి సంబంధించిన లీజు వ్యవహారాలు క్లియర్ అయితే కాని మేము ముందుకు ప్రొసీడ్ కాలేము" అంటూ చెప్పుకొచ్చిండు. మల్హోత్రాకు చాలా అసహనంగా ఉంది. పెద్ద పెద్ద అధికారులను, సంబంధిత మినిస్టరును కల్సి అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకొని చివరికి అధికారి ముందు ఫైలు పెండింగ్‌లో ఉండటం అతనికి ఆగ్రహం కల్గించింది. అయితేనేమి ప్రొసీజర్ అలా ఉంది. శర్మగారి సంతకం అయితే కాని లీజు వ్యవహారం ముందుకు సాగదు.

"మల్హోత్రాగారూ, లీజు వ్యవహారంలో కొన్ని రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఉన్నాయి. అవన్నీ ఫుల్‌ఫిల్ కాకుండా మేము ఆ ఫైలును పై అధికారులకు పంపించడం జరగదు. మీరు ఇలా మా పనిలో జోక్యం చేసుకొని తొందర పెట్టడమేమీ బాగాలేదు" అంటూ శర్మగారు కటువుగానే బదులిచ్చిండు. దాంతో మల్హోత్రా "సరే చూస్తాం ఎన్ని రోజులు పెండింగ్‌లో పెట్టుకుంటారో పెట్టుకోండి" అంటూ కోపంగా లేచి వెళ్ళిపోయిండు.

అటు తరువాత చీఫ్ సెక్రటరీ నుండి ఫైలు తొందరగా క్లియర్ చేయమని ఫోను ద్వారా ఒత్తిడి తెచ్చిండు. అంటే పై అధికారిని ఇన్‌ఫ్లూయెన్స్ చేశారని తెలుస్తూనే ఉంది. కాని శర్మగారి మనసు ఒప్పుకోలేదు. సైటు పరిశీలించి వచ్చిన తరువాత లీజు కాంట్రాక్టులో పేర్కొన్న దానికి, వాస్తవానికి పొంతన లేదని తేలిపోయింది. అసెస్‌మెంటు తప్పుగా ఉంది.

క్వారీ కెపాసిటీకి, కాంట్రాక్టు కోసం ప్రైవేటు సంస్థ పేర్కొన్న దానికి పొంతన కుదరటం లేదు. క్వారీ కెపాసిటీని తక్కువ చేసి చూయించటం ద్వారా

ప్రభుత్వానికి వేల కోట్లు నష్టం వస్తుంది. నామమాత్రపు లీజుకు వేల కోట్ల విలువ చేసే దేశ సంపదను ప్రయివేటు సంస్థ లాభాల కోసం ధారాదత్తం చేయటానికి అతని మనసు ఒప్పలేదు. అసెస్‌మెంటు సరిగా ఉండాలని, రూల్స్ సక్రమంగా పాటించాలని, మరోసారి సర్వే చేయించి అసెస్‌మెంటు సరిగా ఉంటే కాని లీజు వ్యవహారం క్లియర్ చేయలేమని పై అధికారులకు రిపోర్టు చేయడం జరిగింది. కాని అందుకు బదులేమీ అతనికి అందలేదు. ఈ లోపు క్వారీ లీజు కోసం ప్రయత్నించిన రెండు పెద్ద పారిశ్రామిక సంస్థలు సిండికేటు అయిపోయి ఎలాగైనా క్వారీని చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాయి.

శర్మగారి సర్వీసులో ఇటువంటి ఒదుదుడుకులు, ఒత్తిళ్లు కొత్తేమీ కాదు. అతని ఇరవై సంవత్సరాల సర్వీసులో ఇటువంటి ఆటుపోట్లు చాలా ఎదుర్కొన్నాడు. ప్రొబేషనరీగా అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండే మొదలయ్యాయి. ఒక జిల్లాలోని సివిల్ సప్లయి శాఖలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉద్యోగం మొదలు పెట్టిన నాటి నుండే అతనికి కష్టాలు ప్రారంభమయ్యాయి. రైసు మిల్లర్లు బ్లాకు మార్కెట్‌లో నిత్యావసర వస్తువులను తరలించటం, నిల్వ చేయటం అరికట్టడంలో అతను చూపిన చొరవను, ముక్కుసూటి తనాన్ని జీర్ణించుకోలేకపోయిన మిల్లర్లు, రాజకీయ ఒత్తిడి తెచ్చి అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించి ఊపిరి పీల్చుకున్నారు. అటు తర్వాత జిల్లా కలెక్టర్‌గా పని చేసినప్పుడు, స్థానిక జిల్లా పోలీసు అధికారులకు కలెక్టరుకు పడలేదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రజల పట్ల అతిగా ప్రవర్తించిన పోలీసు డిపార్టుమెంటుతో పేచీకి దిగాడు. చట్టానికి ఎవరూ అతీతులు కారని చట్టాన్ని కాపాడవల్సిన వారే చట్టాన్ని అతిక్రమిస్తే ఎలా? నేరాన్ని నిర్ధారించాల్సింది కోర్టులు... కోర్టులో రుజువు కానంత వరకూ ఎవరూ నేరస్థుడు కాదు. బిహైండ్ ది లా వ్యవహరించడానికి పోలీసులకు గాని, మరెవ్వరికి గానీ అధికారం లేదు అంటూ అతను నిక్కచ్చిగా వ్యవహరించడం జిల్లా పోలీసు అధికారులకు మింగుడు పడలేదు.

జిల్లాలో లా అండ్ ఆర్డర్ మెయిన్‌టెయిన్ చేయడంలో జిల్లా కలెక్టర్ అనవసర జోక్యం చేసుకుంటున్నాడంటూ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుకు, కలెక్టరుకు మధ్య ప్రచ్ఛన్న పోరు జరిగింది. అది కాస్తా ఐ.ఎ.ఎస్. అధికారులకు, ఐ.పి.ఎస్. అధికారులకు మధ్య అధికారం కోసం జరిగే పోరులా వివాదం చెలరేగి చివరికి కలెక్టర్ తీవ్రవాద సానుభూతి పరుడంటూ పరోక్ష విమర్శలు చెలరేగాయి. చివరికి ఈ వివాదం రాష్ట్ర సెక్రటేరియట్ దాకా పోవడం, అది కాస్తా శర్మ గారి బదిలీతో ముగియడం జరిగింది. అక్కడ నుండి అతన్ని ఏ అధికారాలు లేని స్టాంపు అండ్ డ్యూటీ శాఖకు ప్రమోషన్ మీద బదిలి చేసింది ప్రభుత్వం. అటు తరువాత అతన్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా గిరిజన ప్రాంతాలకు పంపింది. అక్కడ

మళ్ళీ అదే ధోరణి. చట్టాన్ని అతిక్రమించి గిరిజన భూములను ఆక్రమించిన గిరిజనేతరులైన భూస్వాముల భూములను ఖాళీ చేయించడానికి సిద్ధమయ్యేసరికి మళ్ళీ మరోసారి వివాదాస్పదుడుగా మారిపోయాడు. నేనేమీ చట్టాన్ని అతిక్రమించడం లేదు. ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన ఆదిమ తెగలను అభివృద్ధి చేయడానికి నియమించబడ్డవాణ్ణి, వాళ్ళ రక్షణ కొరకు ఏర్పాటు చేయబడ్డ చట్టాన్ని అమలు జరపడం నా కనీస ధర్మం అంటూ అతను కచ్చితంగా నిలబడ్డాడు. అందుకు బదులుగా మరోసారి ట్రాన్స్‌ఫర్.

ఈసారి అతనికి రాష్ట్రంలో పేరెన్నిక గన్న ప్రభుత్వరంగ బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీకి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయింది. నిజానికి ఆ కంపెనీ అప్పటికే పీకలోతు నష్టాల్లో కూరుకుపోయి ఉంది. బొగ్గు తవ్వి, తవ్వింది తవ్వినట్టుగా అమ్మే చోట నష్టాలు ఎందుకు వస్తున్నాయో అతనికి మొదట అర్థం కాలేదు. చీటికి మాటికి చెలరేగే సమ్మెలు. అవినీతిలో కూరుకుపోయిన అధికారులు మొత్తం సంస్థను భ్రష్టు పట్టించారు. పరిస్థితులను అర్థం చేసుకొని సంస్థను చక్కబెట్టటానికి అతను కొంతకాలం కష్టపడాల్సి వచ్చింది. చీటికి మాటికి జరిగే సమ్మెలను అరికట్టడానికి అతను కార్మిక సంఘాలతో సత్సంబంధాలు కొనసాగించి ఉత్పత్తి నష్టపడకుండా సమస్యలు పరిష్కరించడానికి తన పరిధిలో అన్ని ప్రయత్నాలు కొనసాగించాడు.

నిజానికి సమ్మెలు చిన్న చిన్న కారణాలకే జరుగుతున్నాయని, వాటిని పరిష్కరించడంలో కొద్దిపాటి చొరవ చూపితే, ఇప్పుడున్న పరిధిలోనే సమస్యలు పరిష్కరించవచ్చు అనేది అతనికి ఆచరణలో అనుభవమయింది. పందికొక్కుల్లా సంస్థను నష్టాల బారిన పడేస్తున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాడు. అలా వివిధ అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన ముప్పయి రెండు మంది అధికారుల మీద ఎంక్వయిరీ ఏర్పాటు చేశాడు. దాంతో అవినీతి అధికారుల్లో కలకలం బయలుదేరింది. కాని తమ పైఅధికారి అయిన ఆయన ముందు తమ పప్పులు ఉడకవని తెలిసి రాజకీయ నాయకులను ఆశ్రయించారు. మరోసారి పై నుండి ఒత్తిడి మొదలయింది. సరిగ్గా ఈ సమయంలోనే విశాఖపట్నంలో ప్రైవేటు రంగ విద్యుత్తు ఉత్పత్తి సంస్థకు బొగ్గు సప్లయి విషయంలో వివాదం చెలరేగింది.

"ప్రైవేటు రంగానికి చెందిన ఆ సంస్థతో బొగ్గు సప్లయి విషయంలో వారు పెట్టిన నిబంధనలు కంపెనీకి ఆత్మహత్యా సదృశమైనవని అతను భావించాడు. ముఖ్యంగా బొగ్గు సప్లయిలో ఎటువంటి ఆటంకాలు ఏర్పడినా, తద్వారా ఆ సంస్థకు నష్టం వాటిల్లితే ఆ నష్టాన్ని కంపెనీయే భరించాలనే నిబంధనల పట్ల అతనికి వ్యతిరేకత ఉంది. ఆ రిస్కు కంపెనీ ఎందుకు భరించాలి. వాస్తవానికి కంపెనీ సప్లయి చేసే బొగ్గును ఉత్పత్తి ఖర్చుల కంటే తక్కువ ధరకు సప్లయి చేస్తూ కూడా అదనంగా ఈ రిస్కును భరించాలనటం కంపెనీ తనకు తాను ఆత్మహత్య చేసుకున్నట్టే అవుతుంది. అందులోనూ కోస్టల్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఆ సంస్థకు రెగ్యులర్‌గా బొగ్గు సప్లయి చేయాలంటే ఎన్నో కష్టనష్టాలున్నాయి. బొగ్గు సప్లయికి అవసరమైన వ్యాగన్ల సప్లయిలో ఆటంకం ఏర్పడినా, తరచుగా వచ్చే తుపాన్లు తదితర కారణాల వల్ల సప్లయికి ఆటంకాలు ఏర్పడితే అటువంటి కారణాలు ఏవీ కంపెనీకి సంబంధించినవి కాకపోయినా కంపెనీయే భరించాలని అనటం ఎంతవరకు సమంజసం" అంటూ శర్మగారు ఆ ఒప్పందం విషయమై తన వ్యతిరేకతను తెలిపారు. దాదాపుగా రెండు సంవత్సరాలు ఆ ఒప్పందం అలా పెండింగ్‌లో ఉండిపోయింది. ఈలోపు ప్రభుత్వాలు మారిపోయాయి. కలగూర గంప పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. పాతికమంది ఎంపిలు కూడా లేని పార్టీకి చెందిన వ్యక్తి ప్రధానమంత్రి అయిపోతే, నలుగురు ఎంపిలు వెనుక ఉన్న వ్యక్తి మినిస్టరు అయిపోయిండు. తుమ్మితే ఊడిపోయే మంత్రి పదవులు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే అవకాశవాద రాజకీయ నాయకులను లోబరచుకోవడం ఎన్ఆర్ఐలకు ఏమంత కష్టం కాలేదు.

అందుకు ఫలితంగా శర్మగారికి మరోమారు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. దాంతో రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఒప్పందం సాధించుకోగలిగింది ఆ విద్యుత్ ఉత్పత్తి సంస్థ. ఈ వ్యవహారంలో వందల కోట్లు చేతులు మారాయని, విద్యుత్ శాఖ సహాయ మంత్రిగా పని చేసిన నాయకునికి రాత్రికి రాత్రే వందల కోట్లు ముడుపులు ముట్టాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రాజకీయ నాయకుల అనేకానేక కుంభకోణాల్లో ఒకటిగా మిగిలిపోయింది వ్యవహారం.

మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ సెక్రటరీగా ఈసారి శర్మగారి మకాం ఢిల్లీకి మారింది. శర్మగారి భార్య శకుంతలకు చాలా రోజుల వరకు శర్మగారు అర్థం కాలేదు. ఎంతోమంది ఐఏఎస్ అధికారులు రాత్రికి రాత్రి కోటీశ్వరులు కావడం ఆమె గ్రహించకపోలేదు. భర్త నిజాయితీ వారసత్వంగా సంక్రమించింది. శర్మగారి తండ్రి గారైన అనంత శర్మగారు స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, నీతికి కట్టుబడ్డమనిషి. స్వాతంత్ర్య పోరాటంలో సర్వం కోల్పోయి చివరికి ప్రభుత్వం ఇచ్చిన పింఛనుతో కాలం గడిపి ఎవరి మీదా ఆధారపడకుండా కాలం గడిపి తనువు చాలించాడు. అనంతశర్మగారు వారసత్వంగా పిల్లలకు ఆస్తి సంపాదించి ఇవ్వకున్నా కష్టపడి పని చేయడం, నిజాయితీగా బతకడం నేర్పిండు. ఆ తత్వమే శర్మగారి నరనరాన జీర్ణించుకుపోయింది. శకుంతల తండ్రి బాగా డబ్బున్న మనిషి. రైల్వేలో కాంట్రాక్టులు చేసి బాగా గడించారు. అల్లుడు ఐ.ఎ.ఎస్. ఆఫీసరు అయినా సంపాదించింది ఏమీ లేదని తెలిసి బిడ్డ పేరున కొంత ఆస్తి రాసి కాలం చేశారు. ఆ విధంగా వారికి డబ్బుకు ఏమీ కొదవలేదు. దాంతో ఆమె భర్తతో పెద్దగా పోరు పడలేదు. అన్ని విధాలుగా ఆయనతో సర్దుకుపోయి బతికింది. ఒక విధంగా ఆమెకు భర్త పట్ల గౌరవం, గర్వం కూడా లేకపోలేదు.

శర్మగారు ఎన్ని ఒడిదుడుకులకు గురైనా కుటుంబ విషయంలో ఒక సామాన్యుడిలా బతికేవాడు. అతనికి తన ఇద్దరు పిల్లలంటే వల్లమాలిన ప్రేమ. పిల్లల ఆలనాపాలనలో అతను పాలుపంచుకునేవాడు. పిల్లలు పెరిగి పెద్దవారైన తరువాత వారితో ఒక స్నేహితుడిలా ఉండేవాడు. పెద్దమ్మాయి శైలజ తండ్రిలా ఐఏఎస్

(మిగతా 23వ పేజీలో)

అంపశయ్య నవీన్

మధ్య తరగతి వాళ్ళు మార్పుకు దోహదం చేస్తారా ?

"సమాజంలో ఏదన్నా మార్పు రావాలంటే అది మధ్య తరగతి వాళ్ళ ద్వారానే సాధ్యమవుతుందంటారు. కానీ భారతదేశంలోని మధ్యతరగతి వాళ్ళను చూస్తే ఆ మాటలో నిజమేదన్నా ఉందా అన్న సందేహం కలుగుతుంటుంది. ఎందుకంటే మన మధ్యతరగతి వాళ్ళెప్పుడూ వాళ్ళ లోకంలోనే ఉంటున్నట్టు కనిపిస్తారు... వాళ్ళ బాగు గురించే తంటాలు పడ్తున్నట్టు, వాళ్ళ పిల్లల బాగు గురించే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తారు. వీళ్ళ వల్ల సమాజం మారుతుందా? వీళ్ళసలు సమాజాన్ని గూర్చి ఆలోచించిందెప్పుడు? నాకు మరో విషయం కూడా చాలా ఆశ్చర్యంగా కనిపిస్తుంది - మీ కవులు, రచయితలు మధ్యతరగతి వాళ్ళ మీద బోల్డు సానుభూతిని ఒలకబోస్తుంటారు. వాళ్ళు చాలీచాలని జీతాలతో సంసారాన్ని ఈదలేక చాలా బాధలు పడ్తుంటారనీ, ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యలేక నానా అగచాట్లు పడుతుంటారని, ఎప్పుడూ అప్పులు చేస్తుంటారని, ఇంట్లో తిండికి లేకపోయినా బయటి ప్రపంచానికి మాత్రం బాగా ఉన్నవాళ్ళలాగే కనబడటానికి ప్రయత్నిస్తుంటారనీ, పరువు కోసం పాకులాడ్తారని... ఇలా మధ్యతరగతి కుటుంబాలను గూర్చి వాళ్ళకేదో దారుణమైన అన్యాయం జరిగిపోతున్నట్టుగా రాస్తుంటారు.. ఇదంతా నిజమేనంటారా?" అంటూ వచ్చాడు మాపక్కింటి పుల్లారావు.

"సమాజంలో ఏ మార్పు రావాలన్నా అది మధ్యతరగతి వాళ్ళ ద్వారానే సాధ్యమవుతుంది అని సామాజిక శాస్త్రవేత్తలు అంటుంటారు. ఆ మాటలో కొంత నిజం లేక పోలేదు. ఎందుకంటే ఒక సమాజపు నియమాలనూ, కట్టుబాట్లను పాటిస్తూ ఆ సమాజపు సాంప్రదాయక విలువల్ని కాపాడేవి మధ్యతరగతి వాళ్ళే. ఏ సమాజమైనా కొన్ని విలువలతో, నియమాలతో స్థిరంగా ఉందంటే అందుకు మధ్య తరగతి కుటుంబాల వాళ్ళే కారకులు. అలాగే ఆ విలువలూ, నియమాలూ, సంప్రదాయాలు మారాలన్నా మధ్య తరగతి వాళ్ళే వాటిని మార్చడానికి సిద్ధపడాలి. అయితే చాలా కాలం వరకు మన దేశపు మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగానే ఉండేది. చాలీ చాలని జీతాలతో చాలా కష్టాలు పడ్తుండేవాళ్ళు. మధ్య తరగతి వాళ్ళు ఏమీ లేకున్నా బాగా ఉన్న వాళ్ళలాగా కనిపించాలని ప్రయత్నిస్తుంటారన్న మాటలో కూడా నిజముండదు. పక్కవాళ్ళు మన గురించి ఏమనుకుంటారో అన్న స్పృహ వీళ్ళల్లో చాలా ఎక్కువగా ఉంటుంది. పండుగలకు, పబ్బాలకూ, పెళ్ళిళ్ళకూ, పేరంటాలకు వీళ్ళు శక్తికి మించి ఖర్చు చేస్తుంటారు. కాస్త దర్జాగా కనిపించాలని వీళ్ళు అప్పులు కూడా బాగానే చేస్తారు - ఆ అప్పుల్ని, ఆ అప్పుల కయ్యే వడ్డీల్ని చెల్లించలేక అష్టకష్టాలు పడుతుంటారు. ఉద్యోగాలు చేసే మధ్య తరగతి వాళ్ళు... వీళ్ళను ఎన్జీవోలు... నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అంటారు... వీళ్ళకు ఇదివరకు చెల్లించబడే జీతాలు చాలా తక్కువగా ఉంటుండేవి. అందుకే ఈ ఎన్జీవోల పరిస్థితి కూడా దయనీయంగానే ఉండేది. తమకంటే ఆర్థికంగా ఉన్న వాళ్ళను అనుకరించడం... శక్తికి మించి ఖర్చు చెయ్యడం.. అప్పుల్లో కూరుకుపోవడం.. ఇవన్నీ ఎన్జీవోల లక్షణాలుగా ఉండేవి. ఈ ఎన్జీఓల మీద బోల్డుసానుభూతి చూపిస్తూ, మీరన్నట్టు చాలా కథలూ, కవితలూ వెలువడ్డాయి. "క్లర్కు సూర్యారావు, క్లర్కు సూర్యారావు పార్క్‌లోకెళ్ళాడు" అంటూ ఆరుద్ర ఓ ఎన్జీవోను గూర్చి ఓ చిన్న కావ్యమే రాశాడు. బాధల్లో ఉన్నప్పుడు మధ్య తరగతి వాళ్ళు పార్కుల్లో కెళ్ళి మనస్సును కాస్త కుదుటపర్చుకుంటారని ఆ రోజుల్లో కవులు రాస్తుండేవాళ్ళు. "రెండో తేదీ నాటి ఎన్జీఓ పర్స్‌లా ఉంది అతని పరిస్థితి" అనే అర్థం వచ్చేలా ఓ కథలో ముళ్ళపూడి వెంకటరమణ చమత్కరించారు. అంటే ఓ ఎన్జీఓ మొదటితేది నాడు తీసుకున్న జీతం రెండోతేదీ నాటికే అయిపోయిందని ఆ రచయిత అభిప్రాయం. ఆ రోజుల్లో పరిస్థితి అలాగే ఉండేది. కానీ ఇప్పుడు కూడా ఎన్జీఓల పరిస్థితి గానీ లేక మొత్తమ్మీద మిడిల్ క్లాస్ వాళ్ళ పరిస్థితిగానీ పూర్వంలానే ఉందనడం మాత్రం వాస్తవం కాదు.. మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన గత యాభై అయిదు సంవత్సరాల్లో జరిగిన ఓ ముఖ్యమైన పరిణామం ఏమిటంటే మధ్య తరగతి బాగా విస్తరించడం... ఒకప్పుడు మొత్తం జనాభాలో పదీపదిహేను శాతం కూడా ఆక్రమించని మధ్యతరగతి ఇవ్వాళ్ళ ముప్పై ఐదు నుండి నలభై శాతం వరకు విస్తరించిందని ఒక స్థూలమైన అంచనా. మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే మిడిల్ క్లాస్ వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా చాలా మెరుగైంది. ఇదివరకు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వాళ్ళను 'బతకలేక బడిపంతులు' అంటుండేవాళ్ళు. కానీ ఇవ్వాళ్ళ బడిపంతుళ్ళ ఆర్థిక పరిస్థితిలో చాలా మార్పొచ్చింది. ఉద్యోగ సంఘాల పోరాటం అనండి, ఇతర కారణాలనండి... ప్రభుత్వోద్యోగుల వేతనాలు ఇప్పుడు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలు ఐదవ వేతన సంఘం సిఫార్సుల కారణంగా ఎవరూ ఊహించనంతగా పెరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలు పెరిగాయంటే వెంటనే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలు కూడా పెరుగుతాయి. ఆ విధంగా ఇవ్వాళ్ళ ఎన్జీవోల వేతనాలుగానీ, ఉపాధ్యాయుల జీతాలుగానీ, కాలేజీల్లో పని చేసే అధ్యాపకుల జీతాలు గానీ చాలా గణనీయంగా పెరిగాయి. దాంతో ఇవ్వాళ్ళ మన దేశపు మధ్య తరగతి కుటుంబాల వాళ్ళు ఆర్థికంగా పెద్దగా ఇబ్బంది పడటం లేదు. ఉన్నత వర్గాలలాగే మధ్య తరగతి వాళ్ళు కూడా ఇవ్వాళ్ళ మన దేశంలో విస్తరిస్తున్న కన్స్యూమరిజంకి.. విలాసవంతమైన జీవితం గడపడానికి అలవాటు పడ్తున్నారు. ఇవ్వాళ్ళ ఏ ఇంట్లో చూసినా కలర్ టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కూలర్లు, విసిఆర్‌లు, సిడి ప్లేయర్లు మొదలైన ఎన్నో ఖరీదైన వినియోగ వస్తువులు కనిపిస్తున్నాయి. వీటితో పాటు వాహనాల వినియోగంలో కూడా మన దేశంలో పెద్ద మార్పొచ్చింది. ఇవ్వాళ్ళ ఏ మధ్య తరగతి వాళ్ళ ఇంట్లో చూసినా టూవీలర్స్ - మోటార్ సైకిలో, స్కూటరో తప్పనిసరిగా కనిపిస్తున్నాయి. ఇంకా లేటెస్ట్ పొజిషన్ ఏమిటంటే మధ్య తరగతి కుటుంబాల వాళ్ళు... ముఖ్యంగా కాలేజీ అధ్యాపకులు, మధ్యతరగతి వ్యాపారస్తులు కార్లు కొనేస్తున్నారు. ఒకప్పుడు ఓ కారు కొనుక్కోవడం అన్నది మిడిల్ క్లాస్ వాళ్ళకు ఎన్నడూ నిజంగాని కలలా కనిపించేది. ఇప్పుడా పరిస్థితి మారింది. ఇలా మిడిల్ క్లాస్ వాళ్ళఆర్థిక పరిస్థితి చాలా మెరుగుపడటం వల్ల వాళ్ళు చాలా తృప్తిగానే ఉన్నారు. మీరన్నట్టు ఇవ్వాళ్ళ మిడిల్‌క్లాస్ వాళ్ళు వాళ్ళ పిల్లల విషయంలో... ముఖ్యంగా వాళ్ళ చదువుల విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు.. ఇవ్వాళ్ళ మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కు చెందిన పిల్లలే ఎక్కువగా అమెరికాకు వెళ్తున్నారు. ఈ కారణాల వల్ల మిడిల్ క్లాస్ వాళ్ళు పాటించే విలువలు కూడా ఇవ్వాళ్ళ మారిపోతున్నాయి. ఆర్థికంగా పైకెళ్ళిపోవడమొక్కటే ముఖ్యమైన విలువ... ఇతర విలువలన్నింటినీ మన మిడిల్‌క్లాస్ వదిలేస్తున్నది... ఇదివరకటిలా సంప్రదాయాల కోసం, సమాజ నియమాల కోసం పాకులాడటం తగ్గిపోయింది. ఆర్థికంగా కలిసొస్తుందనుకుంటే మన వాళ్ళు కులాంతర వివాహాలకంగీకరిస్తున్నారు. అందుకే ప్రేమ వివాహాల పట్ల, కులాంతర వివాహాల పట్ల ఇదివరకున్నంత వ్యతిరేకత ఇప్పుడు లేదు. అలాగే ఇదివరకు మిడిల్ క్లాసు యువకుల్లో రాజకీయ చైతన్యం ఉండేది. కొన్ని సిద్ధాంతాల పట్ల అంకిత భావం ఉండేది. ఇప్పుడు ఆదర్శ భావాలు గానీ, ఒక రాజకీయ సిద్ధాంతం పట్ల అభిమానంగానీ మిడిల్ క్లాస్ వాళ్ళల్లో బాగా తగ్గిపోయాయి. ఈ కారణాల వల్లనే మన దేశంలో అభ్యుదయ భావాలున్న వాళ్ళ సంఖ్య... ముఖ్యంగా సమాజంలోని ఆర్థిక అసమానతలు తగ్గిపోవాలి... సమసమాజం స్థాపించటం కోసం మనవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనుకునే వాళ్ళ సంఖ్య తగ్గిపోతున్నది. నేను బావుంటే చాలు.. పక్క వాడేమయిపోతే నాకేమిటి ? అనుకునే వాళ్ళసంఖ్య పెరిగిపోతున్నది" అన్నాన్నేను. ✤

సామాజిక హోదాను బట్టి కూడా 'క్రూరత్వం' అంటే ఏమిటో నిర్ణయించాలని సుప్రీంకోర్టు భావించింది.

భర్త వదిలేశాడనే కారణంగా సావిత్రికి ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసినందువల్ల ఈ అంశాన్ని కూడా సుప్రీంకోర్టు పరిశీలించింది. నిజానికి సావిత్రి ఈ అంశాన్ని ఎక్కడా లేవనెత్తలేదు. తన పిటిషన్‌లో ఎక్కడా తన భర్త తనను వదిలేశాడన్న విషయాన్ని పేర్కొనలేదు. పిటిషన్‌లో పేర్కొనని విషయాలను కోర్టులు సాధారణంగా చర్చించవు. కానీ ఫ్యామిలీ కోర్టు సావిత్రిని భర్త వదిలేయటం జరిగింది అనే కారణంతో విడాకులు మంజూరు చేసింది. అందువల్ల సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కూడా చర్చించింది.

భర్త ఇంటి నుంచి సావిత్రి స్వయంగా బయటకు వెళ్ళిపోయింది. ఇది ఆమె భర్తకు ఇష్టం లేదు. ఆ తర్వాత చాలా కాలం సావిత్రి భర్తకు దూరంగా జీవించింది. 'వదిలేయటం' అనేది ఒక్క సంఘటనతో పూర్తయ్యేది కాదు. చట్ట ప్రకారం ఒకరు మరొకరిని 'వదిలేయటం' అంటే కాపురం చేసే ఉద్దేశం లేకుండా చాలా కాలం దూరంగా ఉండటం. ఇది నిరంతరం జరిగే ప్రవర్తన. మధ్యలో మనసు మార్చుకుని దాంపత్య జీవితాన్ని కొనసాగిస్తే వదిలేసినట్లు కాదు. కాపురం చేయరాదన్న దృఢ నిశ్చయం ఉంటేనే వదిలేసినట్లు అవుతుంది.

సావిత్రి న్యాయవాది ఆమెకు ఎలాగైనా విడాకులు ఇప్పించటానికి సుప్రీంకోర్టు ముందు ప్రాధేయపడ్డాడు. ఆమె మరో వ్యక్తిని వివాహం చేసుకొని బిడ్డను కన్న విషయాన్ని కోర్టుకు తెలిపాడు. అప్పీలు పెండింగ్‌లో ఉండగా తొందరపడి పెళ్ళి చేసుకోవడం సావిత్రి చేసిన పొరపాటని సుప్రీంకోర్టు విమర్శించింది. భార్యాభర్తల్లో ఎవరో ఒక్కరి ఇష్టాయిష్టాలకు లోబడి వివాహ పవిత్రత ఆధారపడి ఉండరాదని, ఎవరి పొరపాట్లకు వారే బాధ్యులు కావాలని వ్యాఖ్యానిస్తూ సావిత్రికి విడాకులు



మంజూరు చేయటానికి తగిన కారణాలు లేవంటూ తీర్పు చెప్పింది. ప్రేమ్‌చంద్రతో ఆమె వివాహం రద్దు కాలేదు. అబద్ధాలు చెప్పి కోర్టు ద్వారా విడాకులు పొందాలన్న ఆమె పథకం విఫలమయింది. విడాకులు మంజూరు చేయటానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. నిజమైన సమస్య ఉంటేనే కోర్టుకు వెళితే న్యాయం లభిస్తుంది. దుర్బుద్ధితో, మురికి చేతులతో కోర్టును ఆశ్రయిస్తే న్యాయం లభించదని, లాభం చేకూరదని సావిత్రి కేసులో రుజువయింది. ఇలాంటి కథలకు ముగింపు ఉండదు. ✤

అధికారి

(19వ పేజీ తరువాయి)

అధికారి కావాలని కలలు కంటున్నది. మొన్న మెయిన్ కంప్లీటు చేసినా ఇంటర్వ్యూ సరిగా చేయకపోవడం వల్ల అనుకున్నది రాలేదని కస్టమ్స్‌కు సెలక్ట్ అయికూడా అందులో జాయిన్ కాలేదు. మరోసారి కుస్తీపట్టడానికి సిద్ధమైంది. చిన్నమ్మాయి మెడిసిన్ మూడో సంవత్సరంలో ఉంది. అందరు ఐఏఎస్ ఆఫీసర్లలా పెద్దగా డబ్బులు కూడ బెట్టకున్నా కుటుంబపరంగా ఏ ఒడుదుడుకులు లేకుండా ఒకింత సంతృప్తిగానే జీవనం సాగుతున్నది. అయితే ఈ మధ్యన శర్మగారు చిరాకుగా, ఆందోళనగా ఉండటం ఆమె గమనించకపోలేదు. ముఖ్యంగా మాంగనీసు క్వారీ విషయంలో అనేక ఒత్తిడులు, బెదిరింపులు వస్తున్నాయనే విషయం ఆమె గ్రహించకపోలేదు. ఒకటిరెండుసార్లు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోను ద్వారా హెచ్చరించింది కూడా ఆమెకు తెలుసు. అటువంటప్పుడు శర్మగారు తేలిగ్గా నవ్వి "మా నాన్నగారు వందలాది మంది పోలీసులు తుపాకి ఎక్కు పెట్టి ఎదురు నిల్చినా మూడు రంగుల జెండా పట్టుకొని ముందుకు ఉరికేవారు. ఒక్కొక్కసారి చావు దెబ్బలు తిని సోయి తప్పిపోతే తెలిసిన వాళ్ళు ఎవరన్నా మోసుకొచ్చి ఇంటికాడ వదిలి వెళ్ళిన సంఘటనలున్నాయి. అటువంటప్పుడు మా అమ్మ, నేను ఎంతగా భయపడేవారమో నీకు తెలియదు. కాని మా నాన్నగారు మాత్రం ఇదంతా మామూలే అన్నట్టుగా తేలిగ్గా తీసుకునే వారు. కాస్త కుదుట పడ్డే మళ్ళీ మొదటికి వచ్చే వారు" అంటూ చెప్పుకొచ్చేవాడు.

శకుంతల ఏమీ మాట్లాడలేకపోయేది.

"ఒక ఐఏఎస్ అధికారికే రక్షణ లేకపోతే ఇక ఈ దేశంలో ఎవరికి రక్షణ ఉంటుంది. ఇటువంటి బెదిరింపులకు నేను లొంగే వాడిని కాదు. ఊపిరి ఉన్నంత వరకు ఈ బతుకు ఇలా కొనసాగించాల్సిందే" అనే అతని గుండ్రటి ముఖంలో నిచ్చితమైన అభిప్రాయం తాండవించేది. అది చూసి ఆమె కొంత కలత చెందింది.

రాజధాని నగరపు రోడ్లను చీల్చుకుంటూ కారు సన్నగా పరిగెడుతున్నది. డ్రైవర్ కాసిం నెమ్మదస్తుడు. వయసు మళ్ళిన వాడు. తన పై అధికారి పట్ల గౌరవం, వినయ విధేయతలున్నవాడు. ఏండ్ల తరబడి స్టీరింగ్ తిప్పిన చేతులు అలవాటుగా కారును ముందుకు ఉరికిస్తూ రాజధాని నడిబొడ్డున ఉన్న సెక్రటేరియట్ భవనానికి చేర్చిండు. అలవాటుగా ముందుగా కాసిం దిగి వెనుక డోరును తీయటానికి ముందుకు నడిచాడు. అంతలోనే శర్మగారు వెనుక డోరు తెరుచుకొని ఎడమకాలు కిందకు పెట్టి 'కాసిం ఇవ్వాళ మనం నాల్గింటికే ఇంటికి పోవాలి. మా చిన్నమ్మాయి బర్త్‌డేకి బట్టలు తీసుకోవాలి. ఒకవేళ నేను మరిచిపోయినా నువ్వు నాల్గింటికి గుర్తు చేయాలి. మరిచిపోవద్దు" అంటూ ఫైలు కాగితాలను ఎడమ చేతిలో పట్టుకొని వడివడిగా లిఫ్టు వైపు సాగిపోయాడు.

లిఫ్టు బాయి శర్మగారిని చూసి, డోరు ఓపెన్ చేసిండు. లిఫ్టు మెల్లగా పాములా పైకి పాకింది. రెండో అంతస్తులో లిఫ్టులోకి మరో ఇద్దరు చొరబడ్డారు. శర్మగారు పోవాల్సిన మూడో అంతస్తులోకి లిఫ్టు చేరకుండానే లిఫ్టు ముందుకు పోయేలా అందులో ఒకడు బటన్ నొక్కాడు.

"ఏంటిది థర్డ్‌ఫ్లోర్‌లో లిఫ్టు ఆపాలి" అంటూ శర్మగారు చిరాగ్గా అరిచాడు. కాని ఈ ఇద్దరు ఆగంతకులు అదేమీ వినిపించుకోకుండానే ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటూ తమలో తామే వికృతంగా నవ్వారు. సర్రున లిఫ్టు ఐదో అంతస్తులోకి పాకింది. సడన్‌గా లిఫ్టు డోరు తెరుచుకుంది. బలిష్ఠులైన ఆ ఇద్దరు ఆగంతకులు ఒక్కసారిగా శర్మను పట్టుకొని ఎత్తి విసిరేశారు.

కాసిం కారు పార్కు చేసి వస్తుంటే సరిగ్గా ఆయన ముందు శర్మగారు నేల రాలాడు. తల పగిలిపోయి ఎర్రని రక్తం చిమ్మి అతని తెల్లని చొక్కాను తడిపింది. ఒక నిమిషం విలవిలలాడిన శర్మగారిలో చలనం లేకుండా పోయింది. చిమ్మిన రక్తం నేల మీద పరిచిన ఎర్రజెండాలా మిలమిలలాడింది. కాసిం ఈ హఠాత్పరిణామానికి పెద్దగా అరుస్తూ స్పృహ తప్పి పడిపోయాడు.

★ ★ ★

శర్మగారి ఆత్మహత్యపై విచారణ జరపడానికి ప్రభుత్వం ఒక కమిటీని వేసింది. ✤

తిరిగి చెడతారు..

కొండబాబు



వెంకట్ ఉదయ వాళ్ళింటికి వచ్చి చాలా సేపైంది. బయటకు వెళ్ళిన ఉదయ ఎంతకీ రాకపోవడంతో వాళ్ళమ్మానాన్నలతో మాట్లాడుతున్నాడు.

మధ్యాహ్నం మూడయింది. అప్పటికి వాళ్ళు భోజనం చేసేశారు. "భోజనం టైముకు వచ్చేయాలి కదా ఆంటీ" అని ఉదయ గురించి మరోసారి ప్రశ్నించాడు.

''రావాలయ్యా... మరి పనిలో లేటయిందేమో!" అందామె. మూడున్నరయింది. ఈలోగా స్కూటీ ఆగింది ఇంటిముందు. చెమటలతో ఒగర్చుకుంటూ వస్తోంది ఉదయ.

"ఎంతసేపు తల్లీ నీకోసం చూడటం... విసుగొస్తోంది" అన్నాడు వెంకట్ అసహనాన్ని వెల్లడిస్తూ.

"ఇంటిదగ్గర వెయిటింగుకే అంత అసహనమైతే ఎలా? ఇంతవరకూ భోంచేయని నా పరిస్థితి గురించి ఆలోచించు" అందామె కాస్త విసుగ్గా.

"ఏం...బయట క్యాంటీన్‌లో ఏదోకటి తినొచ్చు కదా!" అన్నాడు.

''ఆ తింటాం.... నీకేంబాబూ మగమహారాజువి. ఎక్కడైనా తింటావు. మేంతింటే మగరాయుడిలా హోటళ్ళ మీద పడితింటుంది చూడూ.. అంటారు" అంది.

"ఎందుకలా?"

"స్కూటీ నడుపుతున్నందుకే అంటున్నారు మా అమ్మతో సహా.. ఇక వీధిలో వాళ్ళ సంగతి చెప్పనక్కరలేదు" ఉదయ అంది.

"ఏంటీ? బండిమీద తిరిగితే కూడానా?"

"ఆహాc.. నేనిలా తిరిగి అడిగితే 'ఏంటే అంతేసి నోరు... మగాడిలా' అని కూడా అంటారు" అంది తల్లివైపు చూస్తూ ఉదయ.

* * *

అవును...నిజమే! బండి నడపడం, రోడ్డుమీద ఏదైనా తినడం, కాస్త గట్టిగా మాట్లాడటం చేస్తే మగరాయుడని వ్యాఖ్యానించడం, విమర్శించడం జరుగుతుంది.

అంతేకాదు మహిళలు ప్యాంటు షర్టూ వేసుకున్నా, క్రాఫ్ చేయించుకున్నా, షూ వేసుకున్నా అలాగే అంటుంటారు కొందరు. అంతేకాదు...బొట్టు పెట్టుకోకపోయినా, గాజులేసుకోకపోయినా, ఇంకా మెట్టెలు...పట్టీలు లాంటివి....మెడలో ఆభరణాలు వేసుకోపోయినా.... మగాడిలా ఏంటది?" అనేస్తారు.

ఎందుకిలా జరుగుతోందంటే పితృస్వామిక సమాజం తయారుచేసిన 'మూస'లోనే స్త్రీ తయారు కాబడాలని. అంటే తన భావాలు చంపుకోవాలి. ఆలోచనలు అణచుకోవాలి. తిరగకూడదు. తిరిగినా వేగంగా తిరిగేందుకు వాహనాలు నడపకూడదు. నడిపినా వాటిపై అనువుగా ఉండే ప్యాంటూ షర్టులు లాంటివి ధరించకూడదు. ధరించినా అవేసుకుని ఎక్కడికి బడితే అక్కడకు వెళ్ళకూడదు. వెళ్ళినా తినకూడదు. తినడానికే కాదు...ఇవన్నీ చేయకూడదని చెబితే తిరిగి అనడానికి కూడా నోరు తెరవకూడదు. ఇదీ పితృస్వామిక మూస. ఎవరైనా ఈ మూసను ఛేదించుకు బతికితే 'మగరాయుడ"ని ముద్రవేసి మళ్ళీ మూసలోకి నెడతారు.

'మగరాయుడు' అని అనటంలోనే మగాడికి మాత్రమే ఈ హక్కులన్నీ ఉన్నాయనడమూ ఉంది. ఆడది ఆ పని చేస్తే ఆడతనాన్ని కోల్పోయినట్లే అనే నిబంధనా వుంది. స్త్రీలను మగరాయుడని అవహేళన చేసే పలుకుబడిలోని అంతరార్థం ఇదే!

'ఆడది తిరిగీ మగాడు తిరగకా చెడతార'నే సామెతా ఇలా పుట్టిందే. ఈ రోజుల్లో ఆడదైనా, మగాడైనా బయట తిరిగి నాలుగు విషయాలు తెలుసుకోకపోతే బతకడం కష్టం. మోసపోవడమూ ఖాయం. స్త్రీకి బయట తిరగాల్సిన పనేముంటుందని వాదించే వాళ్ళూ ఉంటారు. అంటే అన్నింటికీ మగాడిపైనే ఆధారపడమని చెప్పడమే ఆ కుతర్కంలోని ఉద్దేశం. ఒకవేళ వారు చెప్పినట్లు చేసినా, ఏదో ఘటనలో భర్త చనిపోయి, పిల్లలు చిన్నవాళ్ళయితే ఆమె పరిస్థితేమిటి? కనీసం భర్త 'డెత్ బెనిఫిట్స్'నయినా ఎవరిపై ఆధారపడకుండా పొందగలదా? కాబట్టి కొన్ని పనులయినా చేసుకునే పాటి తెలివీ, కలివిడీ పెరగడానికి బయటి అవగాహన కూడా అవసరం.

పాఠక స్పందన

హ్యాపీబర్త్‌డే

హ్యాపీబర్త్‌డే శీర్షికన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ చిన్నారుల ఫొటోలను ప్రచురించడం బాగుంది. ఒక్కో మనిషికి ఒక్కో రంగంలో ప్రావీణ్యం వుంటుంది. వారికి ఆసక్తిగల రంగంలోనే రాణించగలరు. అలాకాకుండా అన్నిటిలోనూ ప్రావీణ్యం సంపాదించాలని చూస్తే ఆసక్తి వున్న రంగంలో కూడా రాణించలేరన్న సత్యాన్ని మనలో మాట శీర్షికన ప్రచురితమైన సకల కళాప్రావీణ్యంలో చక్కగా విశదీకరించారు. పుస్తకం ఒక విజ్ఞాన ఖని. మన దేశంలో పుస్తకం కొనాలన్నా, పేపర్ కొనాలన్నా వృథా ఖర్చుగా చాలా మంది భావిస్తుంటారు. రోజుకు పది రూపాయలు పెట్టి సిగరెట్లనయినా తాగుతారు కానీ, రెండు రూపాయలుపెట్టి ఒక పేపరును కాని, పది రూపాయలు పెట్టి ఒక పుస్తకాన్ని కాని కొనరు. కొనకుండా చదవాలనే తాపత్రయపడుతుండటం మనం ప్రయాణాలు చేసేటప్పుడు (బస్సుల్లో, రైళ్లలో) చూస్తుంటాము. అంపశయ్య నవీన్‌గారి పుస్తకాల్ని కొని చదువుతారా? అన్న వ్యాసం చదివిన తరువాతనైనా డబ్బుపెట్టి పుస్తకాలు కొనడం దండుగ అనే సంస్కృతి నుండి మన తెలుగుజాతి బయటపడాలని కోరుకుంటున్నాను.

- అమ్మిన వెంకట అమ్మిరాజు, భద్రాచలం

- పెండెం **శాంతిలక్ష్మి,** హైదరాబాద్

బాలనేస్తాలుబాగుంది

ఆదివారం సంచికలో ప్రచురిస్తున్న బాలనేస్తాలు పేజీ చక్కటి విషయాలతో మమ్మల్ని ఆనందపరుస్తున్నది. **- కె.అభిషేక్,** భద్రాచలం

అవగాహన అవసరం

ఆగస్టు 25వ తేదీ సంచికలో బాల వికాసం శీర్షికన ప్రచురించిన 'పోటీతత్వం పట్ల అవగాహన ఏర్పరచాలి' బాగుంది. పోటీతత్వం ఎలా ఉండాలో రచయిత చక్కగా వివరించారు. **- పడవల మురళి,** సౌత్‌మోపూర్, నెల్లూరు జిల్లా

నిరుద్యోగంపై వ్యాసం బాగుంది

నిరుద్యోగం విలయ తాండవం నేటి విద్యావిధానానికి మాయని మచ్చగా ఉంది. నిరుద్యోగం ఈ తీరున ప్రబలిపోతే దేశ యువత ఏమైపోతుందా అని భయమేస్తోంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

సెన్సార్ అవసరం

జీవనశైలిలో 'సినిమాను సెన్సార్ చేయడం అవసరమేనా?' అనే వ్యాసం సెన్సార్ ఆశ్యకతను తెలియజేసింది. **- పి.శ్రీనివాస్,** పాపన్నపేట, మెదక్